# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 20 ఆగస్టు 2024 | HYDERABAD




కలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన


బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకుంటున్న అర్హులు

# న గరం.. రకం

- ఎటు చూసినా వాహనాలే
- అష్టదిగ్బంధంలో నగరం
- చుక్కలు చూపించిన ట్రాఫిక్
- పట్టించుకోని పోలీసులు
- రాత్రి దాకా.. నత్తనడకన వాహనాలు..

**సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో నగరం అతలాకుతలమైంది. దీనికి తోడు రాఖీ పండుగ కావడంతో ప్రజలు రోజువారీ కంటే ఎక్కువ సంఖ్యలో బయటకు వచ్చారు. దీంతో నగరం ట్రాఫిక్‌తో అష్టదిగ్బంధనంగా మారింది. ఎటు చూసినా రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. ఓ పక్క వాన, మరో పక్క స్తంభించిన ట్రాఫిక్‌తో వాహనదారులు నరకయాతన పడ్డారు. చాలా చోట్ల ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు కనిపించలేదు. కొన్ని జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉన్నా.. వారు సిగ్నల్స్‌ను వేయడానికి లేదా ఫొటోలు తీయడానికే పరిమితమయ్యారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఎక్కడ కూడా ట్రాఫిక్ పోలీసులు పనిచేసిన దాఖలాలు కనిపించలేదు. టోలీచౌకి, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్, లక్డీకాపూల్, బంజారాహిల్స్, జీవీకే, పంజాగుట్ట, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, మైండ్ స్పేస్ జంక్షన్, కేపీహెచ్‌బీ, జేఎన్‌టీయూ, బేగంపేట, రసూల్‌పురా, ప్యారడైజ్, ప్యాట్నీ, సంగీత్, మెట్టుగూడ, హబ్సిగూడ, తార్నాక, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే ఉండటంతో చుక్కలు కనపడ్డాయి. అధికారులు త్వరితగతిన ట్రాఫిక్‌ను క్లియర్ చేయకపోవడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.**



## గ్రేటర్‌లో పలు చోట్ల భారీ వర్షం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో సోమవారం మధ్యాహ్నం నుంచి గ్రేటర్ వ్యాప్తంగా పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరదనీరు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది. రాత్రి 9.30గంటల వరకు షేక్‌పేట, యూసుఫ్‌గూడలో అత్యధికంగా 5.45 సెం.మీ, గచ్చిబౌలిలో 5.25 సెం.మీ,ఫిల్మ్‌నగర్‌లో 4.93 సెం.మీ, బాలానగర్, జూబ్లీహిల్స్‌లో 4.60 సెం.మీ, వెస్ట్ మారెడ్‌పల్లి, కుత్బుల్లాపూర్ గాయత్రీనగర్‌లో 4.10 సెం.మీ, లంగర్‌హౌస్, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్‌లలో 3.58 సెం.మీ, రామచంద్రాపురం, రాజేంద్రనగర్‌లో 2.90 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు గ్రేటర్‌లో తేలికపాటి నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.9డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.8డిగ్రీలు, గాలిలో తేమ 91శాతంగా నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు.

# భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

## గంటల కొద్దీ తేరుకోని షేక్‌పేట

మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జాం..

కుమ్మరించిన వానతో అతలాకుతలమైన గ్రేటర్

మరో రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా సోమవారం మధ్యాహ్నం కురిసిన వాన గ్రేటర్ జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. దాదాపు గంట పాటు కుమ్మరించిన వర్షంతో కొన్ని చోట్ల ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోళ్లు, నాలాలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా వరుణుడి 'దెబ్బకు షేక్‌పేట షేక్ అయింది. 5.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. షేక్‌పేటలో గల్లీ నుంచి ప్రధాన రహదారులపై వరద నీరు ముంచెత్తింది. కార్లు, బైకులు కొట్టుకుపోయాయి..షేక్‌పేట వైపు ప్రయాణం అంటేనే జడిసిపోయేలా చేసింది. రాత్రి వరకు షేక్‌పేట వరద ప్రభావం నుంచి కోలుకోలేదు. ఒక్క షేక్‌పేటే కాదు..శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, బాలానగర్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. ఈ క్రమంలోనే చిన్నపాటి వర్షానికే నెమ్మదించే నగర ట్రాఫిక్ భారీ వర్షానికి స్తంభించిపోయింది. మరోవైపు నగరంలో అనేక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా... కొన్నిచోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. అదృష్టవశాత్తు గ్రేటర్ వ్యాప్తంగా ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. మొత్తంగా ట్రాఫిక్ పోలీసులు, సహాయక చర్యల ఆలస్యంతో నగరంలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది.


జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్ కాలనీలో చేరిన వరదనీరు..

# వెలగని గృహజ్యోతి

ప్రజా పాలన సేవా కేంద్రాల చుట్టూ

ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు

పనిచేయని వెబ్‌సైట్‌తో ఇబ్బందులు

**ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు విస్మరిస్తున్నది. వాటిలో ఒకటి గృహజ్యోతి పథకం. ఆది నుంచీ పలు నిబంధనలు పెట్టిన ప్రభుత్వం ఇప్పటికీ సరిగా అమలు చేయడం లేదు. తెల్ల రేషన్‌కార్డు ఉంటేనే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ప్రకటించింది. దీంతో అర్హులైన ప్రజలు ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, తెల్ల రేషన్‌కార్డు నిబంధనతో కొంతమంది పథకానికి దూరమవ్వగా, ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు జరిగిన పొరపాట్లతో మరికొందరికీ ఈ పథకం అందడం లేదు. అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి ఆయా కార్యాలయాలకు వెళ్తే.. వెబ్‌సైట్ సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.**

సిటీబ్యూరో, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ముఖ్యంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారందరికీ ఉచిత విద్యుత్‌ను అందిస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీని మరిచి కేవలం తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికే ఈ పథకం వర్తిస్తుందని ప్రకటించింది. దీంతో అర్హత ఉన్నప్పటికీ చాలా మంది ఈ పథకానికి దూరమయ్యారు. అదే సమయంలో అద్దె ఇళ్లలో ఉండే వారికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు జరిగిన పొరపాట్లతో కొందరు ఈ పథకానికి నోచుకోవడం లేదు. తెల్ల రేషన్‌కార్డు నిబంధనతో లక్షలాది మంది అర్హత కోల్పోగా, మరికొందరు ఇతర కారణాలతో లబ్ధి పొందలేకపోతున్నారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి అద్దె ఇళ్లల్లో ఉంటున్న వారు కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజాపాలన సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రజా పాలన దరఖాస్తు సమయంలో మీటర్ నంబర్ రాయకపోవడం వల్ల ఇప్పుడేమీ చేయలేమని చెప్పడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్ ఇచ్చిన తర్వాత ప్రజాపాలన పోర్టల్ సరిగా ఓపెన్ అవడం లేదని అర్హులు వాపోతున్నారు.

### పనిచేయని వెబ్‌సైట్

గ్రేటర్ పరిధిలో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాల్సింది దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్). అయితే గ్రేటర్ పరిధిలో నివాసం ఉంటే జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో, నగర శివారు ప్రాంతాల్లో అయితే మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటే మండల ప్రజా పరిషత్ కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తులను ఇవ్వాల్సి ఉంది. తెల్ల రేషన్‌కార్డు ఉండి అర్హులైన వారు ఆయా కార్యాలయాలకు వెళ్లినా అక్కడ ఈ పథకానికి సంబంధించిన వెబ్‌సైట్ (https://prajapalana.telangana.gov.in) సరిగా పనిచేడం చేయలేదని వాపోతున్నారు. నగర శివారు మున్సిపల్ కార్పొరేషన్ అయిన బండ్లగూడ జాగీర్‌లో కార్యాలయానికి స్వయంగా వెళ్లినా, ఒక్క రోజులో పని పూర్తి కావడం లేదని, పలుమార్లు కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని అర్హులు వాపోతున్నారు. ఇలా ఒక్క చోటే కాదు గ్రేటర్ చుట్టు పక్కల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని సర్కిల్ కార్యాలయాల్లోనూ గృహజ్యోతి అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహజ్యోతి పథకాన్ని ఏప్రిల్ నుంచే అమలు చేస్తున్నా, ఇప్పటికీ అర్హులు ఆయా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజాపాలనకు సంబంధించిన వెబ్‌సైట్ సమర్థవంతంగా పనిచేసేలా తీర్చిదిద్దాలని గృహజ్యోతి అర్హులు కోరుతున్నారు.


**రాఖీ సంబురం** ▶ తెలంగాణ భవన్‌లో రాఖీ సంబురాలు అంబరాన్నంటాయి. పార్టీ మహిళా నేతలు, మహిళా ప్రజాప్రతినిధులు తండోపతండాలుగా తరలివచ్చి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చేతి నిండుగా రాఖీ కట్టారు. మహిళా నేతలంతా రామన్నలో ఒక అన్నను, ఒక తమ్ముడిని చూసుకొని మురిసిపోయారు.

# ఒక్కరికీ రుణమాఫీ కాలేదు

## 19 గ్రామాల్లో 1330 మంది రైతుల ఆందోళన

మేడ్చల్, ఆగస్టు19(నమస్తే తెలంగాణ): సహకార సంఘాల్లో అడిట్ పూర్తయిన రైతులకు రుణమాఫీ కావడం లేదు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఘట్‌కేసర్ సహకార సంఘం పరిధిలోని 19 గ్రామాలకు చెందిన 1330 రైతుల్లో ఏ ఒక్కరికీ రుణమాఫీ జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 9 సహకార సంఘాల్లో ఘట్‌కేసర్, పూడూర్, అల్వాల్ సహకార సంఘాల్లో అడిట్ జరగలేదన్న నెపంతో రుణమాఫీ నిలిచిపోయిందని రైతులకు అధికారులు తెలిపారు. అయితే ఇటీవలే అడిట్ పూర్తి అయి మళ్లీ రుణమాఫీ పొందే రైతుల జాబితాను పంపించిన ఇప్పటి వరకు రుణమాఫీ ఊసే లేకుండా పోయింది. పూడూర్ సహకార సంఘం పరిధిలో 14 గ్రామాలు ఉండగా రుణమాఫీ పొందే రైతులు 1423 మంది ఉండగా ఇందులో 214 మందికి మాత్రమే రుణమాఫీ వచ్చింది. మిగతా రైతులు పూడూర్ సహకారం సంఘం చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకుండా పోయింది. బౌరంపేట్ సహకార సంఘంలో 632 మంది రైతులకు 11 మాత్రమే రుణమాఫీ అయ్యింది.

### మూడు విడుతల్లో 3,436 మంది రైతులకే

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడు విడుతలుగా రుణమాఫీ అయ్యింది 3,436 మంది రైతులకు మాత్రమే. జిల్లా వ్యాప్తంగా 30 వేల పైచిలుకు రుణమాఫీ పొందే అర్హత ఉన్న 9 సహకార సంఘాల పరిధిలో కొంతమందికి మాత్రమే ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.





### రుణమాఫీ కాలేదు

రుణమాఫీ ఎందుకు చేస్తలేరు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంత వరకు చేయలేదు. మొదటి విడుతలో రుణమాఫీ కావాల్సి ఉన్నా ఇంత వరకు రుణమాఫీ చెయ్యలేదు. ఎకరం 20 గుంటల భూమి ఉండగా రూ. 40 వేల రుణం తీసుకున్నాం. మాకు రేషన్ కార్డు ఉన్నా మాఫీ కాలేదు.బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేదు. - ప్రభాకర్‌రెడ్డి,సోమారం



### రుణమాఫీ చేస్తరా.. లేదా ?

ఘట్‌కేసర్ సహకార సంఘ పరిధిలోని ఏ ఒక్క రైతుకు రుణమాఫీ కాలేదు. నాకు ఐదెకరాల భూమి ఉండగా రూ. 2 లక్షలు పంట రుణం తీసుకున్న. రుణమాఫీ అయితుందని చెబుతున్న ఇప్పటి వరకు కాలేదు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందా లేదా చేస్తే త్వరగా చేసి ఆదుకోవాలి.

- నర్సింహ,అంకుశాపురం

## ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

ప్రజావాణిలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి


సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డిలతో కలిసి కమిషనర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో 25 విన్నపాలు రాగా, టెలిఫోన్ ద్వారా 4 విన్నపాలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సత్యనారాయణ, యాదగిరి రావు, నళిని పద్మావతి, సీసీపీ కె. శ్రీనివాస్, అదనపు సీసీపీ గంగాధర్, ఆయా విభాగాల వాల్యుయేషన్ అధికారి మహేశ్ కులకర్ణి, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, ఎస్ఈ హౌసింగ్, జాయింట్ కమిషనర్ ఎంబీఎం కృష్ణకుమారి పాల్గొన్నారు.



# ఛీ కెన్ బిర్యానీ

## ప్రజారోగ్యంతో చెలగాటం

గచ్చిబౌలిలో పలు చోట్ల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



సిటీబ్యూరో, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతోన్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ, వైద్యారోగ్యశాఖ టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతున్నది. ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లతో పాటు సూపర్‌మార్కెట్లు, ఐస్ క్రీం పార్లర్లు ఇతర వాటిపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారి పై కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగానే గచ్చిబౌలిలోని పలు ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు గచ్చిబౌలిలో ఫ్లైఛజో వంటగది అపరిశుభ్రంగా ఉందని, డస్ట్‌బిన్‌లపై సరైన మూతలు లేకుండా తెరిచి ఉన్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన కొన్ని ఆహార పదార్థాల ప్యాకింగ్‌లకు లేబుల్స్ సరిగా లేవని, ప్యాకేజ్డ్ చికెన్ రోజుల తరబడి నిల్వ ఉన్నట్లు గుర్తించారు. గచ్చిబౌలిలోని ది గ్లోబ్ గుర్భ్‌లో ఆర్వో వాటర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవని తేల్చారు. గచ్చిబౌలిలోని హోయ్ పంజాబ్‌లో నిల్వ చేసిన వెజ్ బిర్యానీ చూసి అధికారులు ఖంగుతిన్నారు. వంటలో వినియోగించే నూనె జిడ్డుగా ఉన్నట్లు గుర్తించారు. వాటర్ బాటిళ్లలో వాటర్ ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు.